క్లుప్తంగా

అర్హులందరికీ ఉచిత విద్యుత్ ఇవ్వాలి



మాట్లాడుతున్న విఠల్‌రావు

పెనుబల్లి: అర్హులైన పేద ప్రజలందరికీ ఉచిత విద్యుత్ ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చలమాల విఠల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ముఖ్య నాయకుల సమావేశం వీయంబంజర్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డు లేని వారికి కూడా కార్డు మంజూరు చేసి.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందజేయాలన్నారు. అలాగే రైతుభీమా పథకాన్ని అమలు చేయాలని, రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు, నాయకులు సత్యం, అరుణ్‌ప్రతాప్, నరసింహారావు, నాగమణి, బాబు, చిరంజీవి, వెంకటేశ్వరరావు, సీతారాములు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేనిని కలిసిన నాయకులు

చింతకాని: ఖమ్మం నగరంలో సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని పార్టీ మండల నాయకులు బుధవారం కలిశారు. అస్వస్థతకు గురై చికిత్స పొంది మొదటి సారి ఖమ్మం వచ్చిన సందర్భంగా తమ్మినేనిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మడుపల్లి గోపాలరావు, నాయకులు వత్సవాయి జానికిరాములు, రాచబంటి రాము, తోటకూరి వెంకటనర్సయ్య, నన్నక కృష్ణమూర్తి వాకా సీతారామిరెడ్డి, మద్దిని బస్వయ్య, పులి యజ్ఞనారాయణ, ఆలస్యం రవి, తదితరులు పాల్గొన్నారు.

15న ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్ట్



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు, పోలీసులు

వైరా: ఈ నెల 15, 16, 17 తేదీల్లో జిల్లాలోని అన్ని మండలాల స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోట ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు టాలెంట్ టెస్టుకు సంబంధించిన పోస్టర్‌లను వైరా ఏఎస్ఐ వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బుధవారం వైరాలో ఆవిష్కరించారు. అనంతరం ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ.. గత 20 ఏండ్లగా జిల్లా వ్యాప్తంగా మండల స్థాయి, జిల్లా స్థాయిలో టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టెస్టులో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమూరి అజయ్, బానోత్ కృష్ణ, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న చంద్రావతి

మధిర: మధిర పట్టణంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం నిరుపేదలకు అన్నదానం చేశారు. ఉదయలక్ష్మి మెటల్ అధినేత చంద్రావతి ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ అన్నదాన కమిటీ నిర్వాహకులు కోనా జగదీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజసేవలో భాగస్వాములు కావాలని కోరారు.

పాస్టర్ల ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గం ఇదే..

ఎర్రుపాలెం: మధిర నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని గురువారం మండలకేంద్రంలోని క్రీస్తు ప్రేమాలయ మందిరంలో ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షులుగా జి.తిమోతి, ప్రధాన కార్యదర్శిగా వి.దేవరాజ్, కోశాధికారిగా టి.జీవరత్నం, ఉపాధ్యక్షుడిగా యోహాను, జాయింట్ సెక్రటరీగా సత్యపాల్‌లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక నియోజకవర్గ ఇన్‌చార్జ్ రెవరెండ్ కృపాకర్ సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.ఆనందరావు, ఎన్.బాబురావు, జె.సమూయేలు, సైమన్, దయాకర్, వీరయ్య, తదితరులు ఉన్నారు.

రోడ్డు పాడై.. ప్రమాదాలకు తోడై

అధ్వానంగా తల్లాడ-కొత్తగూడెం ప్రధాన రహదారి

- అడుగడుగునా గుంతలతో నరకయాతన
- గుంతల్లో పడి గాయాలపాలవుతున్న వాహనదారులు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు



తారు లేచిపోయిన ఆర్‌అండ్‌బీ రోడ్డు



లక్ష్మీనగర్ వద్ద.

తల్లాడ: తల్లాడ-కొత్తగూడెం ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం, పారిశ్రామిక పట్టణాలైన కొత్తగూడెం, పాల్వంచకు ఈ మార్గం నుంచి వందలాది వాహనాలు వెళ్తుంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు అధ్వానంగా తయారైంది. ఇంతటి ప్రాధాన్యత కల్గిన ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైన పట్టించుకున్న నాథుడు లేడు. గుంతలు 3 నెలలు గడుస్తున్నా పట్టించుకోక పోవడంతో ఈ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది.

పది కిలోమీటర్లు మేర గుంతలు..

తల్లాడ-ఏన్కూరు మధ్య పలు చోట్ల గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా తయారయ్యాయి. సుమారు పది కిలోమీటర్ల వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పైన ఉన్న తారు లేచి గుంతలు ఏర్పడ్డాయి. అంతే కాకుండా కంకర రాళ్లు పైకి తేలాయి. రాత్రి పూట వాహనదారులకు ఈ గుంతలు దగ్గరకొచ్చే వరకు కన్పించడం లేదు. ఇక బస్సుల్లో, కార్లలో ప్రయాణించే వారి పరిస్థితి మరింత దారుణం. వాహనం గుంత వద్దకు వచ్చినప్పుడు సడెన్ బ్రేక్ వేసినా, ఒక వేళ ఆ గుంతలో పడినప్పుడు అందులో ప్రయాణిస్తున్న వారు నడుములు విరిగేలా ఎగిరిపడాల్సి వస్తోంది. ఒక్కోసారి బస్సు ముందున్న కడ్డీలకు తగిలి గాయాలైన సంఘటనలున్నాయి.

తరచూ ప్రమాదాలు..

ఆర్‌అండ్‌బీ రోడ్డులో పలు చోట్ల గుంతలు ఏర్పడటంతో ప్రమదాలు తరచూ జరుగుతున్నాయి. ఇటీవల లారీ గుంతను తప్పించబోయి ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టగా ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయాలైన సంఘటనలున్నాయి. సిగ్నళ్లు, హెచ్చరిక బోర్డులు కూడా ఈ రోడ్డులో ఏర్పాటు చేయకపోవటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాజదాని, ఇతర పట్టణాల నుంచి తల్లాడ మీదుగా ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం, కొత్తగూడెం వంటి పట్టణాలకు వివిధ వాహనాలు వెళ్తుంటాయి. గుంతల్లో పడి వాహనాలు కూడా దెబ్బతింటున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయలేదు.

మరమ్మతులు చేపట్టాలి..



తల్లాడ-ఏన్కూరు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పాడై పోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. తక్షణమే గుంటలను పూడ్చి వేసి శాశ్వత ప్రాతిపదికతన రహదారిని బాగు చేయాలి. ఈ సీజన్‌లో అయితేనే రోడ్డు పనులు కొనసాగుతాయి.

– తుమ్మలపల్లి రమేష్, అన్నారుగూడెం

ప్రమాదకరంగా గుంతలు..



తల్లాడ నుంచి ఏన్కూరు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు అధ్వానంగా తయారైంది. రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. ఈ గుంతలు తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీ కొట్టిన సంఘటనలు జరగుతున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– మద్దిబోయిన పంపాద్రి, అన్నారుగూడెం

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి..



రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. తల్లాడ-కొత్తగూడెం రోడ్డులో ఆర్ అండ్‌బీ అధికారులు హెచ్చరిక సూచన బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టాలి. ప్రమాదాలు నివారణకు అవగాహన కల్పించాలి. రోడ్డుకు మరమ్మతులు చేయాలి.

– షేక్ యాకూబ్ పాషా, అన్నారుగూడెం

స్వగ్రామంలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన



అనంతరాములు సమాధి వద్ద నివాళులర్పిస్తున్న భట్టి దంపతులు

వైరారూరల్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క – నందిని దంపతులు బుధవారం స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురంలో పర్యటించారు. తొలుత గ్రామానికి చేరుకున్న భట్టి దంపతులకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మీపురంలోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆతర్వాత భట్టి సోదరుడు, మాజీ పీసీసీ అధ్యక్షుడు మల్లు అనంతరాములు వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు శీలం వెంకటనర్సిరెడ్డి, పుల్లయ్య, హరినాథ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొనగా... ఏసీపీ రెహమాన్, సీఐ నూనావత్ సాగర్, ఎస్సై మేడా ప్రసాద్ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటుచేశారు.

కల్వర్టుకు అడ్డుగా రైల్వే ప్రహరీ నిర్మాణం



కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్, గ్రామస్తులు

కారేపల్లి: సింగరేణి (కారేపల్లి) గ్రామ పంచాయతీ కల్వర్టుకు అడ్డుగా, వరద నీరు పోకుండా..రైల్వే అధికారులు ప్రహరీ నిర్మించటంతో ఎంపీడీఓ చంద్రశేఖర్ బుధవారం గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గారమస్తులు ఎంపీడీఓకి వివరిస్తూ.. కారేపల్లి శివాలయం సమీపంలోని కల్వర్టు ద్వారా వరద నీరు రైల్వే ట్రాక్ అండర్ కల్వర్టు నుంచి పెద్దచెరువులోకి చేరేది. కాగా.. ఇటీవల రైల్వే అధికారులు శివాలయం సమీపంలో ఉన్న కల్వర్టుపై ప్రహరీ నిర్మించడంతో వర్షం వచ్చినప్పుడల్లా భారీఎత్తున వరద నీరు నిలిచి పోయి జనావాసాల్లోకి చేరుతుందని తెలిపారు. గతంలో వర్షం నీటి కారణంగా ప్రహరీ కూలిపోతే దానికి గ్రామస్తులనే బాద్యులను చేసి కేసులు పెట్టారన్నారు. స్పందించిన ఎంపీడీఓ రైల్వే స్టేషన్ మాస్టర్ పిడమర్తి ప్రసాద్‌ను కలిసి సమస్యను వివరించి, వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్ స్పందించి.. రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి యాకలక్ష్మి, గ్రామ పెద్దలు నారాయణ, చంద్రప్రకాశ్, సురేందర్ మనియార్, బాలకృష్ణ పాల్గొన్నారు.

12 నుంచి నులిపురుగుల నివారణ దినోత్సవం

తల్లాడ: ఈ నెల 12న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో 1 నుంచి 19 సంవత్సరాల లోపు వారందరికీ నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు మండల వైద్యాధికారి రత్న మనోహర్ అన్నారు. తల్లాడ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం టాస్క్ ఫోర్స్ సమావేశం ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మొత్తం 7,416 మందికి నులి పురుగులు మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుభాషిని, సీహెచ్ఓ భాస్కర్, సూపర్‌వైజర్‌పెద్ద పుల్లయ్య, రోజాకుమారి, అక్తర ఉన్నిసా బేగం, వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



చింతకాని: ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మధిర: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా ఈ నెల 16న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం నరసింహారావు పిలుపునిచ్చారు. ఈ సార్వత్రిక సమ్మెలో పాల్గొంటున్నట్లు సివిల్‌సప్లై కార్మికులు బుధవారం సివిల్ సప్లై ఆర్ఐకి సమ్మె నోటీస్ అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు నాగమల్లేశ్వరరావు, నాగరాజు, గోపి, ప్రసాద్, ఏడుకొండలు, కృష్ణ, ఆదాం పాల్గొన్నారు.

చింతకాని: దేశవ్యాప్త సమ్మెలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ.. కార్మికులు బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అమర్లపూడి అప్పారావు మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు యల్లయ్య, బుచ్చయ్య, నాగేశ్వరరావు, సైదులు పాల్గొన్నారు.

కొణిజర్ల: కొణిజర్లలో భారత్‌బంద్‌ను జయప్రదం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం కొణిజర్లలో ఆ సంఘం నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, సోమయ్య, వెంకటేశ్వర్లు, గోపయ్య, వెంకన్న, గిరి, వెంకయ్య, నాగమణి, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సత్కారం

ఎర్రుపాలెం: మండలకేంద్రానికి ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ బి.శ్రీనివాసరావును గురువారం ఎంపీపీ దేవరకొండ శిరీష, గ్రామ కార్యదర్శి ఎస్ఎస్ నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ కడియం శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు ఇస్మాయిల్, లక్ష్మణరావు, రాజీవ్‌గాంధీ, బాబురావు, నర్సిరెడ్డి, అనీల్‌కుమార్, పుల్లారావు, కృష్ణ, రాజేష్, బాజీ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు..

మండలంలోని భీమవరం హరిజనవాడ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కోట వజ్రమ్మను, పాలక వర్గ సభ్యులను గురువారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. గ్రామ పంచాయతీకి ఆమె అందించిన సేవలను పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి ప్రశంసించారు. కార్యక్రమంలో మండల నాయకులు బండారు నర్సింహారావు, అనుమోలు వెంకట కృష్ణారావు, షేక్ జానీబాషా, నాగిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కృష్ణయ్య, జక్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

తల్లాడ: సీఎం రెవంత్‌రెడ్డిపై అవాకులు, చవాకులు పేలితే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. బుధవారం తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో నాయకులువెంకటేశ్వరరావు, రాము, రమేష్, నరసింహారావు, వెంకటనారాయణ, జోషఫ్, రామారావు, పాషా, శ్రీనివాసరావు, గోపయ్య, కృష్ణయ్య, పోశంరాజు, బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

కారేపల్లి: మండలంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది చదువుతున్న విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. స్టడీ మెటీరియల్‌ను అందించారు. వీటిని కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని కారేపల్లి హైస్కూల్, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ విద్యాలయం, పేరుపల్లి, బాజుమల్లాయిగూడెం, మాణిక్యారం, కోమట్ల గూడెం, విశ్వనాథపల్లి, గేటుకారేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పది చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో మోడల్ ప్రిన్సిపాల్ ఎండీ అక్తర్, కారేపల్లి హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు ప్రొటీన్ పౌడర్ ప్యాకెట్లు పంపిణీ

సత్తుపల్లిటౌన్: శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యాన పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి, గంగారం పీహెచ్‌సీలలో గర్భిణులకు ప్రొటీన్ పౌడర్ ప్యాకెట్లను ఉచితంగా బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో గ్రామసభలు



పంచాయతీలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

పెనుబల్లి: మండలంలోని గ్రామ పంచాయతీల్లో బుధవారం ప్రత్యేకాధికారులు గ్రామ సభలు నిర్వహించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లోని నిర్వహించిన పారిశుద్ధ్య పనులపై గ్రామ సభల్లో ప్రణాళికలు రూపొందించారు. మొదటిరోజు బుధవారం గ్రామాల్లో పాదయాత్ర చేపట్టి పారిశుద్ధ్య సమస్యలను గుర్తించారు. గురువారం గ్రామాల్లోని మురికి కాలువలు, డ్రెయినేజీలు శుభ్ర పరచడం, శుక్రవారం డెంగీ దోమల నివారణకు ఫ్రైడే డ్రైడే.. పాటించాలని, శనివారం గ్రామాల్లో పాడుపడిన బావులు, పనికిరాని బోరుబావులను గుర్తించి వాటిని పూడ్చివేయడం, ఆదివారం ఉపయోగంలో లేని మరుగుదొడ్లను వినియోగించేలా అవగాహన కల్పించడం, సోమవారం గ్రే వాటర్ నిర్మూలనకు స్టాక్ ఫిట్లను ఏర్పాటు చేయడం, మంగళవారం ఇళ్లలోని మరుగుదొడ్ల వద్ద రెండో గుంతను ఏర్పాటు చేయించడం వంటి పనులకు ప్రణాళికలు గ్రామ సభల్లో చర్చించారు. అలాగే ఈ పనులు ఖచ్చితంగా జరిగేలా ప్రతి రోజు చేసిన పనులను ప్రత్యేకాధికారులు పరిశీలించి ఆ ప్రదేశంలో ఉండే ఫొటోలను సంబంధిత అధికారులకు నివేదిక అందజేయాలని తీర్మానించారు.

సమస్యలు తెలుసుకునేందుకే..



కిష్టారం పంచాయతీలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

సత్తుపల్లిరూరల్: గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే పాదయాత్ర నిర్వహిస్తున్నామని పంచాయతీల్లోని ప్రత్యేక అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం మండలంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం, ఏపీఓ బాబురావు, పంచాయతీ స్పెషలాఫీసర్లు, కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ఆళ్లపాడు గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ చందర్

బోనకల్: గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల తహసీల్దార్ పొన్నం చందర్ సూచించారు. గురువారం మండలంలోని ఆళ్లపాడు గ్రామంలో ప్రత్యేకాధికారిగా ఆయన గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మరుగుదొడ్లను ఉపయోగించుకోవాలని, ఇంకుడు గుంతలు తీసుకోవాలని, రోడ్డుపైకి వృధా నీరు రానీయకూడదని, చెత్త వేయొద్దని తెలిపారు. ప్రతి వీధిలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పంచాయతీలో ఒకే వ్యక్తికి రెండు ఉద్యోగాలు కల్పించి జీతాలు ఇస్తున్నారని, ఈ విషయమై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ బీసీ సంఘం అధ్యక్షుడు కందుల పాపారావు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు బొంగ రాములు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై విచారించి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి జొన్నలగడ్డ పరశురాం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కారేపల్లి: గ్రామపంచాయతీలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు కారేపల్లి ఎంపీపీ మాలోత్ శకుంతలకిషోర్ అన్నారు. బుధవారం కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెం గ్రామపంచాయతీలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలలో భాగంగా స్పెషల్ ఆఫీసర్ ట్రాన్స్‌కో ఏఈ రామకృష్ణ అధ్యక్షతన గ్రామసభను నిర్వహించారు. అంతకుముందు బాజుమల్లాయిగూడెంలో సమస్యల గుర్తింపుపై పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి..

సింగరేణి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ ఎం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరగాల్సిన గ్రామసభ, ప్రజలు రాకపోవడంతో సాయంత్రానికి వాయిదా వేశారు. కారేపల్లిలోని గణేష్ సెంటర్‌లో టమకా వేయించి, ప్రజలను రప్పించి ఎంపీడీఓ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలు గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామ కార్యదర్శి యాకలక్ష్మి పాల్గొన్నారు.

పల్లెల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు..



మాట్లాడుతున్న ఎంపీడీఓ మహాలక్ష్మి

కొణిజర్ల: మండలంలోని 27 పంచాయతీలలో ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొణిజర్లలో తహసీల్దార్ తఫజల్ హుస్సేన్, పెద్దమునగాలలో ఎంపీడీఓ కె.మహాలక్ష్మిలు గ్రామ సభలో పాల్గొని ప్రసంగించారు. గ్రామాల్లో గతంలో సర్పంచ్‌ల పదవీకాల సమయంలో ఎలా పారిశుద్ధ్య పనులు నిర్వహించారో ఆదే విధంగా ప్రస్తుతం కూడా సమర్ధవంతంగా చేయాలన్నారు. గురువారం నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

ముగిసిన పశువైద్య శిబిరాలు



వైద్య శిబిరంలో పాల్గొన్న పశువైద్యులు, కళాశాల విద్యార్థులు

మధిర: మండలంలో ఈ నెల ఒకటి నుంచి జరుగుతున్న ఉచిత పశువైద్య శిబిరాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు రాయపట్నం, సిరిపురం, దేశినేనిపాలెం, వంగవీడు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పశువుల్లో వివిధ రకాల వ్యాధుల నివారణకు చికిత్స అందించారు. పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, పశువైద్య కళాశాల హైదరాబాద్, ఖమ్మం జిల్లా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొని జాతీయ సేవా పథకంలో భాగంగా పశుగణాభివృద్ధికి పునరుత్పత్తి చికిత్సలు శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ.. పశుపోషకులకు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ అనుమోలు విజయ్, డాక్టర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. గ్రామాల్లో పశువైద్య శిబిరాల నిర్వహణకు సహకరించిన పోషకులకు, మండల ప్రజలకు పశుసంవర్ధక శాఖ అధికారులు అభినందనలు తెలిపారు.

మహాసభలను విజయవంతం చేయండి

సత్తుపల్లిటౌన్: మార్చి 3,4,5వ తేదీల్లో ఖమ్మంలో జరిగే సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో బుధవారం జరిగిన సమవేశంలో పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. మార్చి 3వ తేదీ సాయంత్రం ఖమ్మంలో వేలాదిమందితో ప్రజాప్రదర్శన, పెవిలియన్ గ్రౌండ్‌లో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నామన్నారు. 4, 5వ తేదీల్లో భద్రాచలం దాసు కళాక్షేత్రంలో ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు. బహిరంగసభకు ముఖ్యవక్తలుగా ప్రదీప్‌సింగ్ ఠాగూర్, పోటు రంగారావు, సుభాష్‌దేవ్, సంజయ్‌సింగ్‌వి, దినేష్, గోహైన్, కేజీ రామచంద్రర్, కె.రమా, ఆర్.చంద్రశేఖర్, గుమ్మడి నర్సయ్య, కెచ్చెల రంగయ్య హాజరౌతారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు ఎ.వెంకన్న, పుల్లయ్య, శ్రీను, లాజర్, తాటి రాజు, కృష్ణ, అలివేలు, వెంకటనర్సమ్మ, దేవి పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

వేంసూరు: మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు వారివారి శాఖల నివేదికను చదవి వినిపించారు. పలు గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందకపోవడంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న వేసవిలో కూడా ఇలానే నీరు అందిస్తే ప్రజలు ఇబ్బంది పడుతారని మిషన్ భగీరథ అధికారులను నిలదీశారు. భగీరథ సిబ్బంది.. ట్యాంక్‌లో సంగం భగీరథ నీటిని, మరో సగం పంచాయతీ మోటార్‌తో నింపి చేతులు దులుపుకుంటున్నారని, ఈ విషయంపై భగీరథ అధికారులు, సిబ్బంది సమీక్ష జరపాలన్నారు. తహసీల్దార్ ఎంపీ రాజు, ఎంపీడీఓ రమేష్, ఎంపీఓ రంజిత్ కుమార్, సీడీపీఓ కొండమ్మ, ఏఓ రామ్మోహన్, ఎంఈఓ సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

తల్లాడ: జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని బుధవారం తల్లాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల భవనంలో విశ్రాంత ఉద్యోగులను నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మేదరమెట్ల సుబ్బయ్య మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆస్పత్రిలో పెన్షనర్లకు వైద్యం అందించాలని కోరారు. జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దగ్గుల రఘుపతిరెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ ఇబ్రహీం, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు శేష భూషణం, లక్ష్మయ్య, కోటేశ్వరరావు, రామకృష్ణారావు, తిరుపతిరెడ్డి, పఠాన్ ఖాన్, ముత్యాలు, ఆవుల నరసయ్య, మెడివిజన్ ఆస్పత్రి మార్కెటింగ్ ఎక్సిక్యూటీవ్ ఖలీల్ అహ్మద్ పాల్గొన్నారు.